క్లుప్తంగా

రాయితీ వరి విత్తనాల పంపిణీ



రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో చంద్రావతి తదితరులు

పరవాడ: వరి విత్తన శుద్ధి కోసం రైతులు సూడోమోనస్ ఫ్లోరిసెన్స్ లిక్విడ్ ఉపయోగించాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్ చంద్రావతి సూచించారు. కలపాక రైతు భరోసా కేంద్రంలో ఆమె రైతులకు రాయితీపై వరి విత్తనాల పంపిణీ చేశారు. స్వయంభూవరంలో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న 50 ఎకరాల వరి పంటకు అయ్యే వ్యయాన్ని రీ సస్టైనబిలిటి కంపెనీ భరిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కలపాక సర్పంచ్ బొండా కనకారావు, వ్యవసాయ సహాయకులు అనిత, రవికుమార్, సీఎస్సార్ హెడ్ మహేంద్ర, కె.శ్రీకాంత్(రాంకీ ఫౌండేషన్) ఎగ్జిక్యూటివ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీవో వసంత

సింహాచలం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతీ సచివాలయం పరిధిలో విజయవంతంగా నిర్వహించాలని పెందుర్తి ఎంపీడీవో వసంత అన్నారు. గొరపల్లి, సరిపల్లి గ్రామాల్లోని సచివాలయాల్లో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై ఉద్యోగులు, వలంటీర్లకు అవగాహన కల్పించారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందని వారికి సంక్షేమాన్ని అందించేందుకు ఈ కార్యక్రమం జరుగుతోందన్నారు. సచివాలయ ఉద్యోగులంతా పక్కా సమాచారం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో గొరపల్లి సర్పంచ్ శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

నేడు సదస్సు

జగనన్న సురక్ష కార్యక్రమంపై శనివారం గుర్రంపాలెం, పెదగాడి సచివాలయాల్లో అవగాహన సదస్సులు జరుగుతాయని వైఎస్సార్‌సీపీ పెందుర్తి మండల ఇన్‌చార్జి నక్క కనకరాజు తెలిపారు.

'జగనన్న సురక్ష'కు మండల స్పెషల్ ఆఫీసర్లు

దొండపర్తి: జగనన్న సురక్ష పర్యవేక్షణకు మండల స్పెషల్ ఆఫీసర్ల(ఎంఎస్‌వో)ను నియమించారు. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో 11 మండలాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం సక్రమంగా అమలయ్యే విధంగా 11 మంది ఎంఎస్‌వోలు పర్యవేక్షించనున్నారు. పద్మనాభంకు ఎస్‌హెచ్–16 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్‌ఏ), భీమునిపట్నంకు ఆ డివిజన్ ఆర్డీవో, ఆనందపురానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(కేఆర్‌ఆర్‌సీ), విశాఖ రూరల్‌కు స్టీల్‌ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎల్‌ఏ), సీతమ్మధారకు జీవీఎంసీ శానిటేషన్ అండ్ రెవెన్యూ అడిషనల్ కమిషనర్, మహారాణిపేటకు జీవీఎంసీ ఏడీసీ జనరల్‌ను నియమించారు. అలాగే గోపాలపట్నంకు జీవీఎంసీ యూసీడీ పీడీ, ములగాడకు జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి, గాజువాకకు వీఎంఆర్‌డీఏ ఎస్టేట్ ఆఫీసర్, పెదగంట్యాడకు జిల్లా సహకార శాఖాధికారి, పెందుర్తికి డీఆర్‌డీఏ పీడీకి బాధ్యతలు అప్పగించారు.

పోలీసుల అదుపులో ఫేక్ ఐడీ తయారీ ముఠా

అల్లిపురం: వేర్వేరు కేసుల్లో అరెస్ట్ అయిన నిందితులకు బెయిల్ ఇచ్చే వ్యక్తులకు ఫేక్ ఐడీలు, ఆధార్ కార్డులు సృష్టించి వేలకు వేలు దండుకుంటున్న ముఠాను నగర టాస్క్‌ఫోర్సు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహారాణిపేట పరిధి తాడివీధిలో లక్ష్మి అనే మహిళ సహా నలుగురు వ్యక్తులు బెయిల్, పూచీకత్తుల కోసం ప్రయత్నించే వారే లక్ష్యంగా ఫేక్ ఐడీలు, డాక్యుమెంట్లు తయారు చేసి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ముఠాను నగర టాస్క్‌ఫోర్సు పోలీసులు గురువారం రాత్రి అదుపులోకి తీసుకుని మహారాణిపేట పోలీసులకు అప్పగించారు. వారి వద్ద నుంచి కంప్యూటర్, స్కానర్, ప్రింటర్ స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు విజయవాడలో ఉన్నట్లు గుర్తించిన పోలీసుల బృందం ఒకటి అక్కడికి వెళ్లినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందని ఇంకా ఎంత మంది ఉన్నదీ తెలియాల్సి ఉందని పేర్కొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే అదీప్‌రాజ్



లబ్ధిదారుడు పొందిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో కూడా ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కోరారు. జీవీఎంసీ 79 వార్డు దేశపాత్రునిపాలెం గ్రామంలో రెండో రోజు శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని చదివి వినిపించారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని వివరించారు. నిరంతరం సంక్షేమ పథకాలు పేదలకు అందాలంటే జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తూ దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో దోచుకోవడం దాచుకోవడం తప్పా పేదలకు చేసిందేమీ లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు.

స్థానిక సమస్యలపై వినతులు

గ్రామంలో రహదారులతో పాటు మురుగు కాలువల అభివృద్ధి చేయాలని పార్టీ సీనియర్ నాయకుడు కాసు అంజిరెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో మహలక్ష్మినాయుడు, పార్టీ సీనియర్ నాయకులు కాసు అంజిరెడ్డి,ఇల్లపు ప్రసాద్, సీహెచ్ ముత్యాలు, బొద్దపు చిన్నారావు, పూర్ణానందశర్మ, పండూరి వెంకట రమణ, చల్లా కనకారావు, డి.వి. రమణ, లక్కరాజు రాము, కర్రి వినోద్‌కుమార్, ఎస్. నరేష్, రావి సూర్యారావు పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో ఉదయం 9.30 నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు చక్రవర్తి తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఫిర్యాదులన్నీ అక్రమ నిర్మాణాలపైనే..



ఫిర్యాదులు స్వీకరిస్తున్న పట్టణ ప్రణాళిక అధికారి సునీత

దాబాగార్డెన్స్: జీవీఎంసీ పట్టణ ప్రణాళికా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జీవీఎంసీలో నిర్వహించిన 'టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరం'లో వచ్చిన ఫిర్యాదులన్నీ అక్రమ నిర్మాణాలు, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలపైనే అందాయి. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ టౌన్‌ప్లానింగ్ ఫిర్యాదుల కోసం ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరం కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఓపెన్ ఫోరంలో 13 ఫిర్యాదులు వచ్చాయి. జోన్–3 నుంచి ఒకటి, జోన్–5 నుంచి ఆరు, జోన్–6 నుంచి మూడు, జోన్–8 నుంచి మూడు ఫిర్యాదులు అందాయి. పట్టణ ప్రణాళిక అధికారి సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీసీపీ నరేంద్రరెడ్డి, ఏసీపీలు పాల్గొన్నారు.

ఇలా ఫిర్యాదు చేయండి..

జీవీఎంసీ పరిధి 8 జోన్లలో ఎలాంటి అనధికార నిర్మాణాలు జరుగుతున్నా, నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించినా, భవన నిర్మాణ వ్యర్థాల పైన, టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఎలాంటి ఫిర్యాదులు తెలపాలన్నా జీవీఎంసీ టోల్ ఫ్రీ నంబరు 1800 4250 0009కు ఫోన్ చేసి నేరుగా తెలపవచ్చు. అలాగే జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాట్సాప్ నంబరు 8187897569 నంబరుకు ఫిర్యాదు చేయొచ్చు. ఫిర్యాదులో పూర్తి వివరాలు.. పేరు, డోరు నంబరు, వార్డు నంబరు, చిరునామా.. సమస్యతో కూడిన సమాచారాన్ని వాట్సాప్‌కు పంపితే సంబంధిత జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ద్వారా ఉన్నతాధికారులకు నివేదించి, ఆ సమస్యపై సత్వర చర్యలు చేపట్టనున్నారు.

పోరాటమే శరణ్యం

- తమ డిమాండ్లతో ఎమ్మెల్యే ముత్తంశెట్టిని కలవాని నిర్ణయం
- ఆ తర్వాత కార్యాచరణ ప్రకటించనున్నట్టు వెల్లడి
- బాధితులతో సమావేశమైన అఖిలపక్షం నాయకులు



పనులు జరగుతున్న పాత గోశాల వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధితులు

సింహాచలం: బీఆర్‌టీఎస్ బాధితులకు న్యాయం జరగాలంటే పోరాటమే శరణ్యమని అఖిలపక్షం నేతలు నిర్ణయించారు. బాధితుల గోడు పట్టించుకోకుండా అధికారులు మొండివైఖరితో పనులు చేస్తున్నారని, వాటిని అడ్డుకోవాలని ఏక గ్రీవంగా తీర్మానించారు. పాత గోశాల జంక్షన్ నుంచి పాత అడవివరం జంక్షన్ వరకు ఉన్న బీఆర్‌టీఎస్ బాధితులకు అండగా నిలిచి ఐక్యంగా పోరాడాలని ఏక తాటిపైకి వచ్చారు. జీవీఎంసీ 98వవార్డు పరిధిలోని వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు బీఆర్‌టీఎస్ బాధితులతో శుక్రవారం స్థానికంగా ఉన్న ఒక ప్రైవేటు కల్యాణమండపంలో సమావేశమయ్యారు. హామీలను నెరవేర్చకుండా అధికారులు విస్తరణ పనులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. పోరాటం చేస్తేనే సమస్యకు పరిష్కారం లభిస్తుదని ముక్తకంఠంతో నినదించారు. బాధితులతో కలిసి పనులు అడ్డుకుంటేనే అధికారులు స్పందిస్తారని తేల్చిచెప్పారు. విస్తరణలో భవనాలు, స్థలాలు కోల్పోయే బాధితులకు నాలుగు టీడీఆర్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్ట్రక్చరల్ పరిహారం ప్రస్తుత మార్కెట్ వాల్యూ ప్రకారం చెల్లించాలని, స్థలాలు కోల్పోయిన వారికి బదులుగా స్థలం నష్టపరిహారంగా ఇవ్వాలన్నారు. విస్తరణలో పోగా మిగిలిన స్థలంలో నిర్మాణాలు చేసుకునేందుకు సింహాచలం దేవస్థానం, జీవీఎంసీలతో ఎలాంటి ఇబ్బందులు రాకుండా అనుమతులు ఇప్పించాలని డిమాండ్ చేశారు. తమ తీర్మానాలతో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుని కలుస్తామని, అనంతరం భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. బీఆర్‌టీఎస్ బాధితుల సంఘం అధ్యక్షుడు అక్కిరెడ్డి అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, అడవివరం మాజీ సర్పంచ్ పొశర్ల ప్రసాద్, 98వవార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం, 98వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం, వైఎస్సార్‌సీపీ నాయకులు లంక సత్తిబాబు, సిరిపురపు కృష్ణ, గంట్ల కిరణ్, టీడీపీ వార్డు అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, సతివాడ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నివారణకు సమష్టిగా పని చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీ త్రివిక్రమ్‌వర్మ తదితరులు

దొండపర్తి : మాదక ద్రవ్యాల నియంత్రణకు అన్ని వ్యవస్థలు సమష్టిగా పని చేయాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్‌వర్మ సూచించారు. డ్రగ్ ఫ్రీ అవగాహన కార్యక్రమ పోస్టర్‌ను సీపీ శుక్రవారం తన కార్యాలయంలో ఎస్ఈబీ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల నివారణలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సమర్థవంతంగా కృషి చేస్తోందని పేర్కొన్నారు. సాయంత్రం వేళల్లో దాడులు పెంచడం ద్వారా మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టే విధంగా మరింత సమర్థవంతంగా పని చేయాలని ఎస్ఈబీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సెబ్ డిప్యూటీ కమిషనర్ బాబ్జిరావు, జాయింట్ డైరెక్టర్ బమ్మిడి శ్రీనివాసరావు, ఏఈఎస్ బి.శ్రీనాథుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

మహారాణిపేట: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(నేక్)లో అసోసియేట్ ఎలక్ట్రీషియన్ కోర్సులో శిక్షణకు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వి.ఎస్.ఎస్.రవికుమార్ తెలిపారు. పదో తరగతి చదవిన విద్యార్థులకు మహారాణిపేటలోని నేక్ శిక్షణా కేంద్రంలో నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 79895 72891, 83090 59974కు సంప్రదించాలని సూచించారు.

25న వాడచీపురుపల్లిలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం

పరవాడ: మండలంలోని వాడచీపురుపల్లిలో ప్రముఖ వైద్యుడు, దివంగత కేవీ రామన్ జ్ఞాపకార్థం ఈ నెల 25న ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు డాక్టర్ నవ్య ఒక ప్రకటనలో తెలిపారు. వాడచీపురుపల్లి పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరంలో పాల్గొని వైద్య సేవలు పొందాలని డాక్టర్ నవ్య కోరారు.

హస్త కళలను ప్రోత్సహించడం మన బాధ్యత

పీఎం పాలెం: భారతీయ సంప్రదాయ హస్త కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను ఆదరించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శిల్పారామంలో ఏర్పాటు చేసిన అఖిల భారత హస్తకళల ప్రదర్శన– విక్రయాల స్టాల్స్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. చేతితో తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా వారిని ప్రోత్సహించాలని ఎమ్మెల్యే పిలుపు ఇచ్చారు. స్టాల్స్ నిర్వాహక ప్రతినిధి మాట్లాడుతూ శిల్పారామంలో ఏర్పాటు చేసిన 60 స్టాల్స్‌లో దేశంలోని 20 రాష్ట్రాల్లో తయారైయిన హస్తకళల ఉత్పత్తులు ప్రదర్శిస్తున్నట్టు చెప్పారు. కార్యకమంలో నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిళ్లా సుజాత,సత్యనారాయణ,శిల్పారామం ఏవో విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

సబ్బవరం: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలతో పాటు అన్ని ప్రభుత్వ సేవలు అందేలా వలంటీర్లు,సచివాలయ సిబ్బంది కృషి చేయాలని జగనన్న సచివాలయాల మండల కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు అన్నారు. బంగారమ్మపాలెం సచివాలయంలో వలంటీర్లు,సచివాలయ సిబ్బంది, గృహ సారథులకు జగనన్న సురక్ష కార్యక్రమంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు గృహ సారథులతో సమన్వయం చేసుకుంటూ క్లస్టర్ పరిధిలోని ప్రతీ ఇంటికి వెళ్లి వారి సమస్యలను గుర్తించి నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలోనాయకులు కొటాన రాము, పాలిశెట్టి సురేష్ రాజ్, హేమంత్, శరగడం రాము,పిల్లల అప్పలనాయుడు,గవర రాజు పాల్గొన్నారు.

- జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మండల పరిషత్ కార్యాలయం నుంచి ఎంపీపీ బోకం సూర్యకుమారి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావుతో పాటు పలు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మందుబాబులకు జైలు

దొండపర్తి: మద్యం తాగి వాహనాలు నడిపే వారికి కోర్టు రెండు రోజుల పాటు జైలు శిక్షతో పాటు రూ.300 జరిమానా విధించింది. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్‌వర్మ ఆదేశాల మేరకు పోలీసులు నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా చేపడుతున్నారు. ఇదే క్రమంలో మద్యం తాగి వాహనాలు నడిపే వారిని పోలీసులు శుక్రవారం కోర్టులో హాజరు పరిచారు. దీంతో విశాఖ రెండో మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ మందుబాబులకు జైలుశిక్షతో పాటు, జరిమానా విధించారు. గత ఏడాదిలో మద్యం తాగి వాహనాలు నడిపే వారిని పోలీసులు రెగ్యులర్‌గా కోర్టులో హాజరుపరుస్తున్నారు. దీంతో వారు 2 నుంచి 5 రోజులు జైలు శిక్ష అనుభవించాల్సి వస్తోంది. మద్యం తాగి వాహనాలు నడిపితే ప్రాణాపాయమని, వాహనాలు నడుపుతున్నపుడు మద్యం మత్తుకు దూరంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

పలు రైళ్ల రద్దు, మరికొన్ని గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: ఖరగ్‌పూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతాపరమైన పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 24న హౌరా–తిరుపతి (22889) ఎక్స్‌ప్రెస్, హౌరా–ఎర్నాకుళం (22877) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 24, 25వ తేదీల్లో షాలిమార్–హైదరాబాద్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్–షాలిమార్ (18046) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 25న సంత్రగచ్చి–మంగుళూరు (22855) ఎక్స్‌ప్రెస్, హౌరా–పుదుచ్చేరి (12867) ఎక్స్‌ప్రెస్, తిరుపతి– హౌరా (22890) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 26న సికింద్రాబాద్–అగర్తలా (07030) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు.

- వాల్తేర్ డివిజన్ కేకే లైన్ పరిధిలో భద్రతా కారణాల వలన ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. విశాఖపట్నం–కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 25 నుంచి జూలై 1వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్–విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 26 నుంచి జూలై 2వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- విశాఖపట్నం–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ ఈ నెల 25 నుంచి జూలై 2వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్–విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ ఈ నెల 26 నుంచి జూలై 3వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

శ్మశానవాటికల అభివృద్ధికి పెద్దపీట



కైలాసభూముల్లో పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: అంతిమ సంస్కారాలకు అవస్థలు పడకుండా ఉండేందుకు జీవీఎంసీ పరిధిలోని గ్రామాల్లో అభివృద్ధి పనులతో పాటు కనీస వసతులు కల్పిస్తున్నామని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. నరవ ఎస్సీ కాలనీలోని శ్మశానవాటిక షెడ్, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.82.44 లక్షలు, నరవలోని శ్మశానవాటిక షెడ్,కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.99.92 లక్షలు,అదేవిధంగా అహ్మద్‌నగర్‌లో బీటీ రోడ్డుకు రూ.20 లక్షలు,వెదుళ్ల నరవ,అర్జునగిరి శ్మశానవాటికల్లో చెరో రూ.49 లక్షలతో నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. పనులు సత్వరం పూర్తి చేసేలా అధికారులు శ్రద్ధ తీసుకోవాలన్నారు.

విలీనగ్రామాల్లో సమస్యల పరిష్కారం

జీవీఎంసీ విలీన గ్రామాల్లో ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం కూడా కనీస వసతులు కల్పించలేని పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుకు వచ్చిందన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి అజెండాతో ముందుకు వెళ్తున్నామన్నారు.

కార్యక్రమంలో కార్పొరేటర్ ఎం. ముత్యాలు, వైస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గండ్రెడ్డి కనక మహాలక్ష్మినాయుడు, మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, ఇందల సీతారామయ్య, శేఖరమంత్రి శ్రీనివాసరావు, సర్వసిద్ధి బొరయ్యనాయుడు గ్రామ పెద్దలు ఇందల రమణ,ఇందల సీతారామయ్య,ఎర్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరించాలని వినతి

ఆసకపల్లి–దువ్వాడ రోడ్డులోని నంగినారపాడు హైస్కూల్ నుంచి కొత్తూరు వరకూ ఉన్న సుమారు 4.5 కిలో మీటర్ల మేర రోడ్డును విస్తరించాలని నంగినారపాడుకు చెందిన నాయకులు ఇందల సీతారామయ్య,ఇందల రమణ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌ను కోరారు. నంగినారపాడు శ్మశానవాటిక అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వచ్చిన ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. గాజువాక,దువ్వాడ ప్రాంతాలు అభివృద్ధి చెందడంతో పలు కాలనీలు ఏర్పడి వాహనాల రద్దీ పెరిగిందన్నారు. దీంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని చెప్పారు. వాహనాల రద్దీ వల్ల ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుందని వివరించారు. దీనిపై స్పందించిన ఆయన త్వరితగతిన రోడ్డు అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వేద విద్యకు ప్రత్యేక గుర్తింపు అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జీవీఎల్ నరసింహారావు

సబ్బవరం: ప్రపంచ ప్రఖ్యాతి చెందిన వేద విద్యకు ప్రత్యేక గుర్తింపు అవసరమని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. సబ్బవరం మండలంలోని గొల్లల పాలెంలోని సప్త రుషి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం వేద దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ దేవాలయాలపై రాష్ట్ర ప్రభుత్వాలు ఆధిపత్యం చేస్తున్నాయని ఆరోపించారు. దేవాలయాల అభివృద్ధికి మాత్రం చర్యలు తీసుకోవడం లేదన్నారు. వేద విద్యకు సరైన ప్రోత్సాహం అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. వేద అధ్యయనానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలపై చర్చిస్తానని వెల్లడించారు. సభకు అధ్యక్షత వహించిన సప్త రుషి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు మాధవ శర్మ మాట్లాడుతూ కనీస ప్రోత్సాహం లేకపోవడంతో భవిష్యత్తులో వేద విద్య కనుమరుగయ్యే అవకాశాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మన పూర్వీకుల సంపద వేద విద్య అని దాని అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం పలువురు వేద పండితులను ఘనంగా సత్కరించారు.

ఉపాధి కూలీల ధర్నా



ఆందోళనలో పాల్గొన్న ఉపాధి కూలీలు

పరవాడ: ఉపాధి కూలీలకు తాగునీరు, మజ్జిగ వంటి సదుపాయాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలో పి.బోనంగి చెరువు వద్ద ఉపాధి కూలీలతో కలిసి శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరు వారాలుగా ఉపాధి కూలీలకు వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే బకాయి వేతనాలు చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించడని విమర్శించారు. గతంలో మాదిరిగా వేసవి అలవెన్స్ 30 శాతం, తట్ట, పార, గునపం కొనుగోలుకు సొమ్ము చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎస్.మహాలక్ష్మి, కె.అప్పలనరసింహం, జి.లక్ష్మి, ఎం.భారతి, కె.కొండమ్మ, పి.దేముడమ్మ పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి మృతి



బార్ వద్ద పమ్మిడి చిన్నసూర్యం మృతదేహం

సీతమ్మధార: పూటుగా మద్యం తాగిన ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. సబ్బవరం మండలం ఆరిపాక గ్రామంలో పమ్మిడి చిన్న సూర్యం కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. కొద్ది రోజుల కిందట మద్యం తాగి ఇంటికి వెళ్లి భార్యతో గొడవ పడి బయటకు వచ్చేశాడు. రెండు రోజులుగా పూటుగా మద్యం తాగి ఉన్న నేపథ్యంలో శుక్రవారం డైమండ్ పార్కు ఎదురుగా గల గణేష్ బార్ వద్ద అతడు మృతి చెంది ఉండటంతో స్థానికులు గమనించి డయల్ 100కు కాల్ చేశారు. ద్వారకా సీఐ సిహెచ్.సింహాద్రినాయుడు పర్యవేక్షణలో ఎస్ఐ ధర్మేంద్ర సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. చిన్న సూర్యం మృతదేహన్ని కేజీహెచ్‌కు తరలించారు. గతంలో మృతుడు లారీ క్లీనర్‌గా పనిచేసేవాడు.

జాబ్ మేళాకు విశేష స్పందన



అభ్యర్థులకు సూచనలిస్తున్న ఎంప్లాయిమెంట్ అధికారులు, సంస్థ ప్రతినిధులు

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. డబ్ల్యూఎన్ఎస్ గ్లోబల్ సర్వీసెస్, సోలార్ ఎనర్జీ హోల్డింగ్స్, త్రీఎస్ బిజినెస్ ఇన్ఫో సర్వీసెస్, టీంలీజ్ యూనియన్ బ్యాంక్, ఆటోమోటివ్, వరుణ్ మోటర్స్, యాక్సిస్ బ్యాంక్, అపోలో ఫార్మసీ, పలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 715 ఉద్యోగాలకు జరిగిన ఇంటర్వ్యూలకు 569 మంది అభ్యర్థులు హాజరైతే 428 మంది ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను వారు పరిశీలించారు. అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సి,హెచ్.సుబ్బిరెడ్డి, ఎ.సంగీత చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రైవేటు కంపెనీలను ప్రోత్సహించడంతో ఆయా కంపెనీలు నేరుగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయని సుబ్బిరెడ్డి తెలిపారు. అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా సంస్థ ప్రతినిధులు, ఎంప్లాయిమెంట్ సిబ్బంది పాల్గొన్నారు.